భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

జియాగూడ: కార్వాన్ పంచముఖ బ్రహ్మ ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సాహుకారి కార్వాన్, హనుమాన్ స్ట్రీట్, విశ్వఖర్మ సేవా సంఘం కార్వాన్ అధ్యక్షుడు సి.నరహరిచారి, ప్రధాన కార్యదర్శి అనంతచారి, కోశాధికారి రాగిపణి, ప్రేమ్‌చారి, కార్యదర్శి వై.అనిల్‌చారి, సభ్యుడు నర్సింహాచారి ఆధ్వర్యంలో మొదలయ్యాయి. ముందుగా కలశ పూజ, అంకురార్పణం, ధ్వజారోహణం, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి అష్టోత్తర శత నామావళి సహిత హృదయ పుష్పాంజలి, స్వామివారి కల్యాణ మహోత్సవం, మహా ప్రసాద వితరణ, ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శనివారం నిత్య పూజలు, స్వామి వారి ఆరాధన, మహా నైవేద్యం, క్రాంతి భవన్ భజన మండలి, విశ్వాంజనేయ భక్తసమాజం, కిశోర్ భజన మండలిలచే భజన కార్యక్రమం ఉంటాయి. 19న నిత్య పూజలు, చక్రతీర్థం, స్వామి వారి పల్లకీ సేవా కార్యక్రమంతో వేడుకలు ముగిస్తాయన్నారు.

ప్రోటోకాల్ ఆధారిత విధానంతో డెంగీ చికిత్సలు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రోటోకాల్ ఆధారిత విధానంతో గర్భిణులకు ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో డెంగీ చికిత్సను నిర్వహిస్తున్నామని ఫెర్నాండెజ్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరీ తెలిపారు. అబిడ్స్‌లోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో ఆమె మాట్లాడుతూ..జూన్ నుంచి నవంబర్ వరకు వర్షాకాలంలో సంభవించే ప్రధాన ఆరోగ్య సమస్య డెంగీ అని అన్నారు. డెంగీ జ్వరంతో గర్భిణులలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా వారిని సురక్షంగా ఉంచేందుకు ఆసుపత్రిలోని మల్టీ డిసిప్లేనరీ బృందాలచే ప్రోటోకాల్ ఆధారిత విధానాన్ని అమలు చేసి డెంగీ నివారణ చేస్తున్నామన్నారు. గత ఐదు సంవత్సరాల్లో తమ ఆసుపత్రిలో 300 కేసుల్లో ఎలాంటి సమస్యలు లేకుండా డెంగీ నివారణను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఫెర్నాండెజ్ ఆసుపత్రి స్థాపించబడిన మార్గదర్శకాలను అనుసరించడంతో పాటు సమర్థవంతమైన నివారణ, నిర్వహణ, వ్యూహాలను అమలు చేయడంతో తల్లులు, వారి శిషువులు ఆరోగ్యంగా ఉంటున్నారని పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



చిన్నారెడ్డిని సత్కరిస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి పేర్కొన్నారు. దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో చిన్నారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలను తన తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ..28 వేల మంది అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలను ప్రతినెలా రూ.26 వేలకు పెంచాలని కోరారు. ఉద్యోగుల కొత్త పెన్షన్ విధానం బదులు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. యాదగిరి, సురేష్, మహ్మద్ రఫీ, జహీరుద్దీన్ ఆదిల్ షరీఫ్‌తో కలిసి చిన్నారెడ్డిని సన్మానించారు.

ఉద్యోగులకు గ్యారంటీ పథకాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న ఆరు గ్యారంటీ పథకాల తరహాలో ఉద్యోగులకు గ్యారంటీ పథకాలు ప్రవేశపెట్టాలని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. శుక్రవారం గృహకల్ప కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ఆయన పాల్గొని ప్రసంగించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, 2023 పీఆర్‌సీ, హెల్త్ కార్డులు, పెండింగ్ మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులు, జీపీఏకు బిల్స్, సరెండర్ లీవ్ బిల్స్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి లక్షలాది మంది ఉద్యోగులకు అండగా నిలవాలని ఆయన అన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. తాను కూడా ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లాలోని 45 యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు జిల్లా కార్యదర్శి విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్, ఉమార్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్‌కుమార్, హరిబాబు, వైదిక్ శాస్త్రి, బొల్లిగిద్ద శంకర్, గీత సింగ్, మహ్మద్ వహీద్, మాజీ సభ్యులు ప్రభాకర్, జానకి పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) కోర్సు ప్రారంభం

మొదటి బ్యాచ్ ఆగస్టు నుంచి ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో పార్ట్‌టైమ్ మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్) కోర్సును ప్రారంభించినట్లు శుక్రవారం ప్రకటించారు. అధునాతన పరిశోధన నైపుణ్యాలను పెంపొందించడానికి, సాంకేతికత నేతృత్వంలోని ఆవిష్కరణలను నడపడానికి రూపొందించడింది. అంతేకాకుండా టెక్‌లడ్‌ను నడపడానికి వ్యక్తులను శక్తివంతం చేయడానికి వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం పరిశోధన ద్వారా పార్ట్‌టైమ్ పరిశ్రమ ప్రయోజిత మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్)ను ప్రారంభించారు. ఈ కోర్సు మొదటి బ్యాచ్ ఆగస్టు నుంచి ప్రారంభమవుతుంది. ఈ కోర్సును థీసిస్‌కు అవసరమైన పునాది పరిజ్ఞానంతో పాటు కొన్ని కోర్సులు తీసుకోవాల్సి ఉంటుంది. బల్క్ రిజిస్ట్రేషన్‌తో కంపెనీలు సాంకేతిక రంగాలు, సలహాదారులను ఎంచుకోవచ్చు. అలాగే కంపెనీకి అవసరమైన నిర్దిష్ట పరిష్కారాలపై దృష్టి సారించి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌తో ప్రాజెక్టులను సహా సృష్టించవచ్చు. సైన్స్/ ఇంజినీరింగ్, డిగ్రీ, కనీసం ఒక సంవత్సరం టెక్ ఇండస్ట్రీ అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. పాల్గొనేవారు ప్రతి సెమిస్టర్‌లోని వ్యక్తిగత కోర్సులను ఎంచుకోవచ్చు. థీసిస్ ప్రాజెక్టుతో పాటు మూడేళ్లలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో పూర్తి సమయం విద్యార్థులతోపాటు నమోదు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణన్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం లోతైన ముగింపులో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ థీసిస్-ఓరియంటెడ్ కోర్సు ద్వారా హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల ఉద్యోగులు తమ నైపుణ్యాన్ని పొందేందుకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సౌకర్యాన్ని కల్పించాలనుకుంటోందన్నారు. ఈ ప్రత్యేకమైన పరిశ్రమ-విద్యా సహకారం కంపెనీలకు బలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అవకాశాలను అందిస్తుందన్నారు. సాధారణ విద్యార్థుల మాదరిగానే అదే పరిశోధన సమూహాలతో కలిసి పనిచేయడం ద్వారా పరిశోధనపై మాస్టర్స్ స్థాయి అవగాహనను పొందేందుకు నిపుణులను అనుమతిస్తుందన్నారు. ఇదిలా ఉండగా దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ గౌరీ సతీశ్

బండ్లగూడ: ఉత్తమ ఆలోచనలు ఉంటేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీశ్ అన్నారు. బండ్లగూడలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ మేళాలో విప్రో, ఫ్లిప్‌కార్ట్, యాక్సిస్ బ్యాంక్, అమెజాన్, టీమ్ లీస్ డిజిటల్, ఎస్ఎం ఫౌండేషన్, పీఎస్‌పీ తదితర సంస్థలు సుమారు 179 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 26 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. ఈ సందర్భంగా గౌరీ సతీశ్ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. అవకాశాలను అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానస, శ్రీలత, జ్యోతి, స్వప్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కటోరా హౌజ్ నిర్వహణ

- ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని వైనం
- హామీలతో అధికారుల కాలయాపన
- పేరుకుపోతున్న చెత్తా చెదారం



నీరు లేక ఇంకిపోయిన కటోరా హౌజ్



కటోరా హౌజ్ ఫెన్సింగ్ చుట్టూ వ్యర్థాలు

గోల్కొండ: శతాబ్దాల చరిత్ర గల సుందర తటాకం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కుతుబ్‌షాహీ రాజులు గోల్కొండ కోట సమీపంలో కటోరా హౌజ్‌ను నిర్మించారు. ఈ తటాకం నుంచి సుగంధాలతో కూడిన నీరు కోటలోని రాణి వాసానికి సరఫరా అయ్యేవి. దీన్ని నిర్మాణం, సాంకేతికత నేటికీ ఒక రహస్యంగానే మిగిలిపోయింది. యంత్రాలు లేని ఆ కాలంలో గ్రావిటీ ద్వారానే కటోరా హౌజ్ నుంచి కోటకు నీటి సరఫరా అయ్యేదని చరిత్రకారులు గుర్తించారు. అయితే గోల్కొండ కోటలోని రాణిమహల్ ఫౌంటెన్, ఆయుధాగారం ఇతర చారిత్రక కట్టడాలు నేటికి చెక్కు చెదరకుండా ఉండగా కటోరా హౌజ్ మాత్రం మురికి కుంటగా మారింది. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో నగర మేయర్లు, కమిషనర్లు, మంత్రులు సైతం కటోరాహౌజ్‌కు వచ్చి పరిశీలించి వెళ్లారు. దీనిని అభివృద్ధి చేస్తామంటూ హామీలు ఇచ్చి వెళ్లారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సైతం ఎందరో అధికారులు కటోరాహౌజ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామంటూ పెద్దగా ప్రకటనలు ఇచ్చారు. ఇందులో బోటింగ్‌తో పాటు పర్యాటకులను ఆకర్షించేందుకు అధునాతనంగా తీర్చిదిద్దుతామంటూ ప్రకటనలు ఇచ్చారు. అయితే వారి మాటలు, హామీలు కాలగర్భంలో గడిచిపోతున్నాయి. మంత్రులు, బల్దియా కమిషనర్లు సైతం తాము ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమయ్యారు. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ ఆధీనంలో ఉన్న కటోరా హౌజ్‌ను బల్దియా అధికారులు అభివృద్ధి చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు. అటూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం గానీ దీన్ని అభివృద్ధికి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు శూన్యం. ప్రతియేటా కటోరా హౌజ్ పూడిక తీతలు, సుందీకరణ అంటూ కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలను వెచ్చిస్తుంది. మరోవైపు గోల్కొండ కోటకు వెళ్లే పర్యాటకులకు కటోరా హౌజ్ పక్క ఉన్న రోడ్డు నుంచే వెళ్తారు. వర్షాకాలంలో మురికి నీరు వేసవి కాలంలో నీటి చుక్క లేక ఎండిపోయిన కటోరా హౌజ్‌ను చూసి ప్రజలు అధికారుల బాధ్యతారాహిత్యంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ ఉన్న ప్రహరీ పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయి ఉంటున్నాయి. కటోరా హౌజ్ పరిసరాల్లో ఉండే వారు ప్రతినిత్యం చెత్తను కటోరా హౌజ్‌లో డంపింగ్ చేస్తున్నారు. ఏదేమైనా కుతుబ్‌షాహి రాజులు నిర్వహించిన కటోరా హౌజ్‌ను ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పర్యటకులు కోరుతున్నారు.

సిటీ కాలేజీలో 5 కొత్త కోర్సులు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదు కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ తెలిపారు. ఉపాధి అవకాశాలకు అనుగుణంగా ఈ కోర్సులను తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు. సివిల్ సర్వీస్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన జ్ఞాన వనరులను విద్యార్థుల్లో పెంపొందింపజేయాలనే సంకల్పంతో ఈ విద్యా సంవత్సరంలో అత్యంత ప్రయోజనకరమైన ఐదు కోర్సులను ప్రవేశపెడుతున్నామన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి పూర్తి వివరాల కోసం కళాశాల దోస్తు కన్వీనర్ డాక్టర్ శంకర్ కుమార్ (9110716674)ను సంప్రదించాలని ఆయన కోరారు.

సఫాయి మజ్దూర్ల హక్కుల సాధనకు కృషి



సతీష్ బిడ్ల

జియాగూడ: దేశంలోని సఫాయి మజ్దూర్ల హక్కుల సాధనకు కృషి చేస్తానని అఖిల భారతీయ సఫాయి మజ్దూరు సంఘ్ నూతన జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల కో ఆర్డినేటర్‌గా నియమితులైన సతీష్ బిడ్లా అన్నారు. శుక్రవారం జియాగూడ వాల్మీకినగర్‌లో ఆయన మాట్లాడుతూ..ముంబైలోని అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు కర్మ సింగ్ కర్మ, వ్యవస్థాపక రాష్ట్రీయ ప్రధాన కార్యదర్శి రాజ్‌పాల్ మహరోలియ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నానని తెలిపారు. మూడేళ్ల పాటు పదవీ బాధ్యతలను చేపడుతారని తెలిపారు. రాష్ట్ర, దేశ స్థాయిలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

నిలోఫర్‌కు పెరుగుతున్న మైనర్ బాలికల ప్రసవాల కేసులు

నాంపల్లి: అత్యాచారానికి గురై, గర్భం దాల్చిన 14 ఏళ్ల ఓ మైనర్ బాలిక ఇంట్లోనే ప్రసవం చెంది చికిత్స నిమిత్తం నిలోఫర్‌కు తరలించిన ఘటనలో తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారు. ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. ప్రసవంలో మైనర్ బాలికకు ఆడశిశువు జన్మించింది. ప్రస్తుతం ఆడ శిశువు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతోంది. ఇదే ఆసుపత్రిలో మరో మైనర్ బాలిక ప్రసవించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని నిలోఫర్ ఆసుపత్రి వైద్యులు గోప్యంగా ఉంచారు. ప్రతి నెలా ఒకటి, రెండూ కేసులు నిలోఫర్ ఆసుపత్రికి వస్తున్నట్లు తెలుస్తోంది.

కార్వాన్‌లో రాజకీయ నిశ్శబ్దం

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల ఘట్టం ముగిసింది. సుమారు నెలన్నర రోజుల పాటు వివిధ పార్టీల నాయకులు తమ అభ్యర్థి కోసం హడావిడి చేస్తూ ప్రచారం నిర్వహించారు. అయితే కార్వాన్‌లో మాత్రం మజ్లిస్ అభ్యర్థి కోసం ఆ పార్టీ నాయకులు, కార్వాన్ మజ్లిస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సారథ్యంలో ప్రచారంతో హోరెత్తించారు. బీజేపీ నాయకులు సైతం తమకు పట్టు ఉన్న ప్రాంతాల్లో వివిధ రకాలుగా ప్రచారం నిర్వహించారు. అయితే ఎన్నికలు ముగిసిన నాటి నుంచి మజ్లిస్‌గానీ, బీజేపీ గానీ చడీచప్పుడు లేకుండా ఉన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సైతం గుపచుప్‌గా ఉన్నారు. నియోజకవర్గంలో ఎటు చూసినా కూడా రాజకీయ హడావిడి ఏమి కానరావడం లేదు. గుట్టు చప్పుడు కాకుండా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తమ పార్టీ అభ్యర్థి గెలుపు ఓటములపై భారీగా చర్చలు జరుపుకుంటున్నారు. ఏదేమైనా కార్వాన్‌లో ప్రస్తుతం రాజకీయ నిశ్శబ్దం వ్యాపించి ఉంది.

'మల్కాజిగిరిలో విజయం నాదే'



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి తానే గెలుస్తున్నానని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి స్వల్పకాల పదవీ కాలంతో ప్రజలు విసిగిపోయారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి ప్రజలకు చేసిన ఒక్క మంచిపని కూడా లేదని ఆయన అన్నారు. ఏదేమైనా తెలంగాణలో తమ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ఖాయమని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, వెంకటేష్‌సాగర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

తెలంగాణలో బీజేపీ హవా



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌తో బీజేపీ నాయకులు

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ హవా జోరుగా వీస్తుందని ఆ పార్టీ కరీంనగర్ అభ్యర్థి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. గతంలో బండి సంజయ్ ఆధ్వర్యంలో తెలంగాణలో జరిగిన ప్రజా సంగ్రామ యాత్రలో భోజన విభాగ్ ప్రముఖ్‌తో పాటు ఆ యాత్ర పదాధికారులు శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రజాగ్రహానికి గురై అధికారంలో కోల్పోయిందన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రజలు ఘోరంగా తిరస్కరిస్తారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనకు ప్రజలు ఏకగ్రీవంగా తమ ఆమోద ముద్ర వేస్తున్నారని ఆయన అన్నారు. దేశంలో మూడో సారి ప్రధాన మంత్రిగా మోదీ పదవీ బాధ్యతలు స్వీకరించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

జోరుగా బోర్ల డ్రిల్లింగ్



నానల్‌నగర్ వద్ద బోరు వేస్తున్న దృశ్యం

గోల్కొండ: బస్తీలు, కాలనీల్లో ఎటు చూసినా బోర్ మోటార్లే కానవస్తున్నాయి. నీటి నిలువలు తగ్గడంతో చాలా మట్టుకు బోర్లు ఇంకిపోయాయి. ప్రైవేటు నీటి ట్యాంకర్ల ధరలకు రెక్కలు వచ్చాయి. 5 వేల లీటర్ల నీటి ట్యాంకర్ బుక్ చేసుకున్న రెండు రోజుల తర్వాత వస్తుంది. 5 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్‌లో వెయ్యి లీటర్లు తక్కువ ఉండడం ఖాయం. ఇటువంటి పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల యజమానులు కొత్త బోర్లు వేసుకోవడం, ఉన్న బోర్లను మళ్లీ రీబోర్లు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. నానల్‌నగర్, గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర డివిజన్లలో ఎక్కడ చూసిన కూడా బోరు బండ్లే డ్రిగ్గింగ్ చేస్తూ కనిపిస్తున్నాయి.

మురుగు సమస్యను పరిష్కరించండి



మ్యాన్‌హోల్ నుంచి పారుతున్న మురుగునీరు

నాంపల్లి: ఓల్డ్ మల్లేపల్లి ఇందిరానగర్‌లో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోంది. ఒక వైపు డ్రైనేజీ నీరు, మరోక వైపు తాగునీటి లీకేజీలు కలిసి పొంగి పొర్లుతున్నాయి. ఇళ్ల ముందే డ్రైనేజీ నీరు కాలువల్లా ప్రవహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మల్లేపల్లి సెక్షన్ వాటర్ వర్క్స్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పొంగుతున్న మ్యాన్ హోల్స్ నుంచి మురుగునీరు బయటకు రాకుండా చూడాలని కోరుతున్నారు.

రెండు కుటుంబాల నడుమ ఘర్షణ

గన్‌ఫౌండ్రీ: భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం రెండు కుటుంబాల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసిన ఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. బేగంబజార్ తోప్‌ఖానాకు చెందిన రామేశ్వర్ (39), సంతోషి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. రామేశ్వర్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని ఏళ్ల నుంచి ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్తతో గొడవ జరిగిన ప్రతిసారీ సంతోషి పాతబస్తీ ఉప్పుగూడలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లేది. ఈనెల 2న సంతోషి తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తమ చెల్లిని బావ వేధిస్తున్నాడనే బెంగతోనే తన తండ్రి మరణించాడని బామ్మర్దులు మనస్సులో పెట్టుకున్నారు. దశదిన ఖర్మ అనంతరం సంతోషి తన అన్నాదమ్ములతో కలిసి రామేశ్వర్ ఇంటికి వెళ్లి నీ వల్లే తమ తండ్రి చనిపోయాడని, ఇకనైనా చెల్లెలిని మంచిగా చూసుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో ఇరువురి కుటుంబాల నడుమ ఘర్షణ చోటు చేసుకోవడంతో సంతోషి, కుటుంబ సభ్యులు రామేశ్వర్, అతని తల్లిపై దాడికి దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాల్లో యువతకు మంచి భవిష్యత్తు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఇమ్రాన్ అలీఖాన్

గోల్కొండ: రాజకీయాల్లో యువతకు మంచి భవిష్యత్తు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇమ్రాన్ అలీఖాన్ ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ అలీఖాన్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తనను భుజం తట్టి ప్రోత్సహించారన్నారు. ఆయనను మార్గదర్శకంగా తీసుకోని తాను రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ చేస్తానని అలీఖాన్ పేర్కొన్నారు.

రోగుల సేవల్లో నర్సుల పాత్ర అమోఘం



నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి హాజరై ప్రసంగించారు. రోగుల సేవల్లో నర్సుల పాత్ర అమోఘమైనదని వివరించారు. డాక్టర్ ఎం.అలివేలు, డాక్టర్ స్వప్న, డాక్టర్ సురేష్, డాక్టర్ స్వాతి విచ్చేసి నవజాత శిశు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రేడ్-1 మ్యాట్రిన్ ఎస్.లక్ష్మి, ఇందిరాలను ఘనంగా సత్కరించారు.

మరిన్ని ఉత్తమ సేవలందించాలి



నాగ్‌నాథ్ మాశెట్టికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పీఠాధిపతి ఎం.ఎస్.గురు సంగన బసవ మహా స్వామి

చార్మినార్: యర్నాల ఉక్కలి అవిముక్త సుక్షేత్ర సంస్థాన్ జగద్గురు పంపావతి శివయోగుల విరక్త మఠం పీఠాధిపతి ఎం.ఎస్.గురు సంగన బసవ మహా స్వామి టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొంటున్న నాగ్‌నాత్ మాశెట్టి రాబోయే కాలంలో కూడా మరిన్ని ఉత్తమ సేవలను అందజేయాలని కోరారు. ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాగ్‌నాథ్ మాశెట్టి ఆయనను సత్కరించారు.

ఇంకా తేరుకోని బస్తీలు, కాలనీలు

గోల్కొండ: నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్‌లలో గురువారం కురిసిన భారీ వర్షానికి వరద నీరు రోడ్లపై భారీగా చేరింది. అయితే లోతట్టు ప్రాంతాల్లో మాత్రం శుక్రవారం సాయంత్రం వరకు వర్షం నీరు నిలిచి ఉంది. టోలిచౌకీ-టూమ్స్ రోడ్డుపై వారాంతపు సంత జరిగే రోడ్డుపై వర్షం నీరు ఇప్పటికి నిలిచి ఉంది. టోలిచౌకీ నుంచి నదీమ్ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డుపై సైతం వాన నీరు నిలిచి ఉంది. గోల్కొండలోని లోతట్టు ప్రాంతాలన్ని రేతిగల్లి, హీరాఖానా రోడ్లపై వర్షం నీరు నిలిచి ఉండడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

మహిళ అదృశ్యం



శశిగుప్తా (ఫైల్)

విజయనగర్‌కాలనీ: మతిస్థిమితం లేని ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అంబేడ్కర్ తెలిపిన వివరాల ప్రకారం..కార్వాన్ అశోక్ విహార్ కాలనీకి చెందిన సంజయ్‌కుమార్ గుప్తా ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. అదే ఇంట్లో ఇతని అక్క శశిగుప్తా(51) కొద్ది రోజుల నుంచి మానసిక వేదనతో బాధపడుతుంది. ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తెలిసినవారు, బంధు మిత్రుల వద్ద వెతికినా ప్రయోజనం లేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శుక్రవారం టప్పాచబుత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి జైలు



షేక్ అజ్హర్ హుస్సేన్

గౌలిపురా: దొంగతనం చేసేందుకు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ న్యాయమూర్తి డి.సి.ఉమాపతి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్‌కట్టా రహమత్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ అజ్హర్ హుస్సేన్ (24) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాడ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతూ దొంగతనానికి ప్రయత్నిస్తున్నాడు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసి హుస్సేన్‌పై ఈ-పెట్టీ కేసు నమోదు చేసుకొని శుక్రవారం నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా..పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ న్యాయమూర్తి డి.సి.ఉమాపతి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

నాంపల్లి: ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడి జేబులో నుంచి సెల్‌ఫోన్‌ను దొంగలించిన ఓ యువకుడిని హైదరాబాద్ జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బోరబండ సబ్దర్‌నగర్‌కు చెందిన జహంగీర్ కుమారుడు సయ్యద్ ఇర్ఫాన్(21) టీ స్టాల్ కార్మికుడు. శుక్రవారం ఉదయం హైటెక్‌సిటీ నుంచి లింగంపల్లి వెళ్లేందుకు చందన్ నాయక్ అనే వ్యక్తి హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ప్లాట్‌ఫారం-2 మీద ఎంఎంటీఎస్ రైలును ఎక్కి ఎంట్రెన్ దగ్గర నిల్చున్నారు. అదే సమయంలో సయ్యద్ ఇర్ఫాన్ అనే యువకుడు ఎంఎంటీఎస్ రైలును ఎక్కి ఎంట్రెన్ దగ్గర నిల్చున్నారు. సరిగ్గా రైలు కదిలే సమయంలో చందన్ నాయక్ జేబులో ఉన్న స్మార్ట్‌ఫోన్‌ను లాక్కుని నెమ్మెదిగా కదులుతున్న రైలు నుంచి కిందకు దూకాడు. తన జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కెళుతున్న క్రమంలో దొంగ చెయ్యిని పట్టుకుని నిలువరించే క్రమంలో కింద పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు.